RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 2 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 9 జూలై 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# జనాల్లోకి రేవంత్!

## క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్న ముఖ్యమంత్రి రేవంత్



### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షలకు నిర్ణయం

### సొంత జిల్లా పాలమూరు నుంచి షురూ.. - నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్ సమీక్ష

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనలపై దృష్టి పెట్టారు. ఇకపై ప్రతి వారం ఒక జిల్లాకు వెళ్లాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమీక్షించడంతో పాటు ఆయా జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. తన సొంత జిల్లా పాలమూరు నుంచి ఆయన పర్యటనలు ప్రారంభించనున్నారు. ఈ నెల 9వ తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలును సీఎం సమీక్షిస్తారని, ఈ మేరకు అన్ని వివరాలతో సమావేశానికి రావాలని క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధిపతులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం అందింది.


**కీలక రంగాలపై ఫోకస్ :** జిల్లాల పర్యటనలో భాగంగా కీలక రంగాలపై ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్టు తెలిసింది. విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడం, వర్షాకాలం నేపథ్యంలో విద్య, వైద్యం, సాగునీటి రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్ష జరుపుతారని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంపై ఇప్పటికే దృష్టి పెట్టిన సీఎం.. ఆ దిశలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్సుల నిర్మాణం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా ఐటీఐల అప్‌గ్రెడేషన్ తదితర అంశాలపై కూడా ఆయన దృష్టి పెట్టనున్నారు. వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధులు, వైద్య శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ వైద్యరంగ బలోపేతం తదితర అంశాలపై కూడా సూచనలు చేయనున్నారు. ఇక ప్రతి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల గురించి స్థానిక అధికారులతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడతారని, త్వరగా పూర్తయ్యేందుకు అవకాశం ఉన్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడం ద్వారా వీలైనంత వేగంగా వాటిని పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించేలా అధికారులకు మార్గదర్శనం చేస్తారని సమాచారం. వీటితో పాటు వ్యవసాయ సీజన్‌కు సంబంధించిన కార్యాచరణ, ఎరువుల లభ్యత, ఉపాధి హామీ పనులను సమీక్షించనున్న సీఎం.. రైతుభరోసా అమలు విధివిధానాలపై కూడా అధికారులతో చర్చించనున్నారు. ఎక్కడికక్కడ జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకోనున్న ముఖ్యమంత్రి, జిల్లా స్థాయిలో అమలు కావాల్సిన అన్ని కార్యక్రమాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. అదే సమయంలో జిల్లాల్లోని శాంతిభద్రతల పరిస్థితిని కూడా సీఎం సమీక్షించనున్నారు.

**ఏడు నెలల పాలనపై ఏమంటారు? :** గత ఏడాది డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాలనా పరంగా సాధారణ కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ, సీఎం ఎక్కువగా రాజకీయ అంశాలపైనే దృష్టి సారించాల్సి వచ్చింది. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలు, ఆ తర్వాత టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, కేబినెట్ విస్తరణ లాంటి అనివార్య రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. అదే సమయంలో పార్టీలో చేరికలపై కూడా దృష్టి పెట్టారు. ఇక వీలున్నంత మేరకు ప్రభుత్వ పాలనపై కూడా సమీక్షలు నిర్వహించారు. ఇటీవలే అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎం ప్రజలతో మమేకం కావాలని వారికి సూచించారు. ఆఫీసుల్లో కూర్చుని పనిచేయడం కన్నా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. కేబినెట్ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం లాంటివి తాత్కాలికంగా వాయిదా పడిన నేపథ్యంలో ప్రస్తుతానికి పాలన వ్యవహారాలపై రేవంత్ దృష్టి సారించారు. తాను సైతం క్షేత్రస్థాయికి వెళ్లాలని నిర్ణయించారు.

తొలుత గత ఏడు నెలల పాలనపై అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల మనోగతం ఎలా ఉందన్న దానిపై కూడా జిల్లాల పర్యటనల సందర్భంగా ఆయన ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమలుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని భావిస్తున్నారు.

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున క్షేత్రస్థాయిలో ప్రజల మూడ్ ఎలా ఉందన్న దానిపై కూడా ఆయన ఫోకస్ పెట్టారని, అందులో భాగంగానే జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారని సీఎంవో వర్గాలు చెబుతున్నాయి.

---




హైదరాబాద్: దశాబ్దకాలంగా అధికారంలో లేక పదవులు పొందలేక, పనులు చేసుకోలేక అవస్థలు పడ్డ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ సారి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఎన్నో ఆశలు పెంచుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అందుకు తగ్గట్టే అధికారం చేపట్టిన నెల రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీ దృష్టి సారించి.. 37 కార్పొరేషన్లకు చైర్మన్లను ఎంపిక చేశారు.

వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే అధిష్ఠానం అనుమతితో వారి నియామకాలకు అంతా సిద్ధం చేశారు. అయితే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడంతో కోడ్ అమల్లోకి వచ్చి.. ఆ నియామకాలకు సంబంధించి ఉత్తర్వుల జారీ ఆగిపోయింది. జులై-08న 35 కార్పొరేషన్ల చైర్మన్ల నియామకంపై జీవో విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది.

**ఎవరికి ఏ పదవి..?** కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా జంగా రాఘవరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా జబ్బార్, సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా అలేఖ్య పుంజాల, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్, కూడా కార్పొరేషన్ చైర్మన్‌గా ఇనగాల వెంకట్రామిరెడ్డి, గ్రామీణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా చల్లా నర్సింహారెడ్డి, టీఎస్ ఐఐసీ చైర్మన్‌గా జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డి, ఫారెస్ట్ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పొదెం వీరయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా కాల్వ సుజాత, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి, ఆగ్రో పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కాసుల బాలరాజు, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా నాగేశ్వరరావు, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మత్స్యసహకార సమాఖ్య చైర్మన్‌గా మెట్టు సాయి కుమార్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా రియాజ్, మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా శోభారాణి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఎం. వీరయ్య, బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతి శ్రీకాంత్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్.ప్రీతం, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా బెల్లయ్య నాయక్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా కె. తిరుపతి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా జైపాల్, కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్‌గా జనక్ ప్రసాద్, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా విజయ్‌బాబు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా శివసేనారెడ్డి, వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకాశ్‌రెడ్డి, సాంకేతిక సేవల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మన్నె సతీష్, పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్‌గా చల్లా నరసింహారెడ్డి, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కె.నరేందర్‌రెడ్డి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఈ. వెంకటరామిరెడ్డి, రహదారి అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మల్‌రెడ్డి రామిరెడ్డి, తెలంగాణ టూరిజం సంస్థ చైర్మన్‌గా పటేల్ రమేశ్‌రెడ్డి, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్‌గా ఎం.పి. ఫహీమ్.

---




ఎన్నికల ఓడిపోయిన అనంతరం బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఆ పార్టీకి నేతలు ఒకరి తరువాత ఒకరి షాకులు ఇస్తూనే ఉన్నారు. కారు దిగి అధికార కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. తాజాగా బీఆర్ఎస్ నుంచి మరో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. అలంపూర్ శాసనసభ్యుడు విజయుడు, శాసనమండలి సభ్యుడు చల్లా వెంకట్రామిరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నట్టు వినిపిస్తోంది. ఇదే జరిగితే ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో బీఆర్ఎస్ దాదాపు ఖాళీ అయినట్టే. ఇప్పటికే ఆ పార్టీ నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్లోకి వచ్చారు. ఈ చేరికతో ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

---

# ఏపీలో బలోపేతంపై దృష్టి!

## రేవంత్‌కు కీలక బాధ్యతలు

## ఏపీ కాంగ్రెస్‌లో మళ్లీ చిగురిస్తున్న ఆశలు



హైదరాబాద్ / అమరావతి : మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పునర్‌వైభవం తీసుకొచ్చిన రేవంత్ రెడ్డి మళ్లీ పదేళ్ల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా చేశారు. వచ్చీ రాగానే పాలనలో తనదైన ముద్రను వేసుకోగలిగారు. అందుకే పార్లమెంట్ ఎన్నికలలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏమీ లేదని తేలింది. సగానికి సగం సీట్లు కైవసం చేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ కలిసి చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ లో అనుకున్న 15 స్థానాలు రాబట్టలేకపోయింది. ఈ విషయాన్నిఅధిష్టానానికి వివరించి చెప్పడంలో సీఎం రేవంత్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి. రేవంత్ రెడ్డికి రోజురోజుకూ అధిష్టానం వద్ద పలుకుబడి పెరిగిపోతోంది. ఇదంతా ఆయన పనితీరు. ప్రస్తుతసంక్షేమ పథకాలు వాటి అమలు తీరు పై రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు రేవంత్ పై చాలా బాధ్యతలే ఉన్నాయి. పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, కేబినెట్ విస్తరణ, లోకల్ ఎలక్షన్ల నిర్వహణ వంటి అంశాలతో పాటు అధిష్టానం రేవంత్ పై పెద్ద బరువే పెట్టనుంది.

**షర్మిల ఫెయిల్ :** ఏపీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వైఎస్ వారసురాలిగా రాజకీయాలలో అడుగుపెట్టింది షర్మిల. కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని ఏపీలో కాంగ్రెస్ ను బలోపేతం చేయడానికి పూనుకుంది. ఒకప్పుడు కాకలు తీరిన రాజకీయ నేతలంతా కాంగ్రెస్ లో ఉండేవారు. వైఎస్ ఆర్ సీపీ ని నమ్ముకుని జగన్ చెంతకు చేరారు. దాంతో ఏపీలో కాంగ్రెస్ తరపున పోటీచేసే చరిష్మా ఉన్న నేతలెవరూ లేకపోవడంతో చాలా చోట్ల డిపాజిట్ కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వయంగా ఆ పార్టీ చీఫ్ షర్మిల ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఏపీలో కాంగ్రెస్ చుక్కాని లేని నావ మాదిరిగా తయారయింది. పార్లమెంట్ ఎన్నికలలో ఓటమి చవిచూసిన షర్మిల అధిష్టానం దృష్టిలో నమ్మకం కోల్పోయింది. అందుకే కాంగ్రెస్ అధిష్టానం స్వయంగా రంగంలోకి దిగింది. ఏపీలో జులై 8న వైఎస్ జయంతి వేడుకలు ఘనంగా జరిపిస్తోంది. వాడవాడలా వైఎస్ ఆర్ ఫ్లెక్సీలతో, కాంగ్రెస్ జెండాలతో సందడి చేస్తోంది. ఇటు తెలంగాణలోనూ వైఎస్ జయంతి వేడుకలు జరిపిస్తోంది. కేవలం 11 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుని కుదేలయిన వైఎస్ జగన్ పార్టీకి ధీటుగా వైఎస్ జయంతి వేదిక కాబోతోంది. వివిధ రాష్ట్రాలనుంచి కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొనాల్సిందిగా అధిష్టానం కబురుపెట్టింది. కాంగ్రెస్ ను బలోపేతం చేయడానికి ఇంతకుమించిన తరుణం లేదని అధిష్టానం భావిస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వైఎస్ జయంతి వేడుకలలో స్పెషల్ ఎట్రాక్షన్ గా మారనున్నారు. ఇకపై ఏపీలోనూ కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి పెట్టాల్సిందిగా రేవంత్ పై పెద్ద బాధ్యతనే పెట్టబోతోంది అధిష్టానం. మొన్నటి సార్వత్రిక ఎన్నికలలోనూ రేవంత్ రెడ్డి స్టార్ క్యాంపెయినర్ గా మారి అయా రాష్ట్రాలలో కాంగ్రెస్ తరపున ప్రచారం చేశారు.

**జాతీయ స్థాయిలో రేవంత్ ప్రచారం :** రేవంత్ రెడ్డి ప్రచారాలు సత్ఫలితాలనే ఇచ్చాయి. ఇండియా కూటమి అనూహ్యంగా పుంజుకుంది. పైగా రేవంత్ రెడ్డి తన ప్రతి ప్రచారంలో మోదీ విధానాలను ఎండగడుతూ వచ్చారు. మోదీ ముస్లిం వ్యతిరేకి అని చేసిన ప్రచారం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారింది. మోదీని గెలిపిస్తే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తారని చేసిన ప్రచారం వైరల్ గా మారింది. మోదీ కలలు కన్న 400 సీట్లకు భారీ గా గండిపడింది. పైగా రేవంత్ రెడ్డి చెప్పినట్లుగానే మోదీకి పూర్తి స్థాయి మెజారిటీ రాకపోగా సంకీర్ణ ప్రభుత్వంతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితిలో ఏపీ కాంగ్రెస్ ను సైతం గాడిలో పెట్టగల సామర్థ్యం కేవలం రేవంత్ కు మాత్రమే ఉందని అధిష్టానం భావిస్తోంది. వైఎస్ రష్మిలకు రేవంత్ రెడ్డి సలహాలు, సూచనలు తీసుకోవాలని అధిష్టానం ఆదేశించినట్లు సమాచారం. రేవంత్ రెడ్డికి ఏపీలోనూ చాలా మంది అభిమానులు ఉన్నారు. ఇక రేవంత్ ఏపీలో తన రాజకీయ గురువైన చంద్రబాబు పైనే అస్త్రాలు సంధించాల్సి ఉంటుంది ముందు రోజుల్లో. ఏది ఏమైనా రేవంత్ పై అధిష్టానం పెద్ద బాధ్యతనే పెట్టబోతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# హమ్మయ్య! ఊపిరి పీల్చుకున్న తెలుగు రాష్ట్రాలు!

ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు శనివారం భేటీ అయ్యారు. మరి ఈ భేటీ చరిత్ర సృష్టించిందా? అంటే.. ప్రస్తుతానికి అయితే.. ఒకింత మేలనే మాటే వినిపిస్తోంది. ఎందుకంటే.. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత.. తలెత్తిన సమస్యలను పరిష్కరించడం.. కేంద్రానికి కూడా సాధ్యం కావడం లేదు. పైగా కొన్ని కొన్ని విషయాలు స్థానిక ప్రజల మనోభావాలు, సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యమంత్రుల మధ్య ఇగో ప్రధాన సమస్యగా మారిన నేపథ్యంలో పదేళ్లలో ఏనాడూ.. ఈ తరహా పరిస్థితి కనిపించనందున ఇప్పుడు జరిగిన సమావేశం కొంతలో కొంత మేలేనని అంటున్నారు పరిశీలకులు. విభజన సమస్యల పరిష్కారం కోసం గతంలో కేసీఆర్.. జగన్ ప్రయత్నించారు. అయితే.. ఇద్దరూ కూడా ఇతర అంశాల్లో రాజీ పడ్డారు. కానీ, విభజన అంశాల్లో మాత్రం రాజీ పడలేకపోయారు. దీనికి కారణం.. ఇరు రాష్ట్రాల్లోనూ రాజకీయ ప్రయోజనాలు ముడి పడి ఉండడమే. ఉదాహరణకు జల సమస్యను తీసుకుంటే.. కృష్ణానది జలాల వ్యవహారమే ఇరకాటంగా మారింది. ఈ జలాల్లో 512 టీఎంసీలను ఏపీకి కేటాయించారు. ఇదే సమయంలో తెలంగాణకు 299 టీఎంసీల ను ఇచ్చారు. దీనికి తెలంగాణ అడ్డుపడుతోంది. తమకు 518 టీఎంసీలు కావాలని పట్టుబడుతోంది. తాజా భేటీలో జల సమస్యను పక్కన పెట్టారు. వాస్తవానికి జనాభా లెక్క ప్రకారం ఏపీ-తెలంగాణ కు 58:42 ప్రాతిపదికన ఆస్తులను పంచాలి. ఇలానే పంచుకోవాలని కూడా దీనిపై ఏర్పడిన రెండు కీలక కమిటీల పెద్దలు సూచించారు. అయితే.. ఈ విభజన ప్రాతిపదిక పోయి.. తెలంగాణలో సొంత అజెండాలు తెరమీదికి వచ్చాయి. 512 టీఎంసీలను ఏపీకి.. 299 టీఎంసీలు తెలంగాణకు బచావత్ ట్రైబ్యునల్ కేటాయించినా... తెలంగాణ నదీ పరీవాహక ప్రాంత విస్తీర్ణం.. కరువు, జనాభా ప్రాతిపదికన 70.80% జలాలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరుతోంది. ఈ వాదన వీగిపోతోంది. దీనికి ఏపీ ససేమిరా అంటోంది. ఇలాంటి వాదనలకు, సమస్యలకు తాజాగా జరిగిన ముఖ్యమంత్రుల భేటీ కొంత దూరం పాటించడం ఆశావహ దృక్పథమనే చెప్పాలి. వాటిని పరిష్క రించే ప్రయత్నం యుద్ధం ప్రాతిపదికన కాకుండా.. చర్చించి నిర్ణయం తీసుకుందామని తేల్చారు. మరో కీలక వ్యవహారం ఆస్తుల విభజన విషయంలో తెలంగాణ వైపు నుంచి ఉన్న తీవ్ర రాజకీయ ప్రమేయం.. అత్యుత్సాహం.. వంటివాటిని ఇప్పుడు తగ్గించే దిశగా అడుగులు పడ్డాయి. ప్రస్తుతం జరిగిన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి ఇది అడ్డంకి కాకుండా మారడం ఆశించదగిన పరిణామమే. సాధ్యమైనంత వరకు సమావేశాన్ని ఆశాజనకంగా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. కాబట్టి.. సమావేశం ముగిసినా.. సమస్యలు తీరేందుకు సమయం పడుతుందని భావించినా.. మొత్తానికి ఇరు రాష్ట్రాల మధ్య కొంత నీలిమబ్బుల వంటి వాతావరణం.. అయితే కొంత మేరకు సమసింది. ఇది మంచి పరిణామమనే చెబుతున్న పరిశీలకులు. మరో రెండు మూడు సిట్టింగుల్లో అయినా.. సమస్యలు సజావుగా పరిష్కారం అయ్యేందుకు తాజా భేటీ మార్గం చూపిందని చెబుతున్నారు.

# ఉచిత వైద్యం.. సేవే ప్రధానం




జగిత్యాల : రోగమేదైనా.. పేదలైనా.. మధ్యతరగతైనా డబ్బులు లేకుండానే అన్ని రకాల వ్యాధులకు అధునాతన వైద్యాన్ని సాయి స్వాస్థ్య వెల్‌నెస్ కేంద్రం నిర్వహిస్తోంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తీన్‌ఖని సమీపంలో 2023 డిసెంబరులో కేంద్రం ఏర్పాటైంది. సత్యసాయి సుజల స్రవంతి ట్రస్టు, సాయి స్వాస్థ్య వెల్‌నెస్ ఆధ్వర్యంలో అందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఓ అద్దె భవనంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. రోగులకు వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణ పరీక్షలు, వైద్య సలహాలతోపాటు మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ఏడు నెలల్లో 1400 మంది ఈ కేంద్రంలో సేవలు పొందారు.

వారానికి మూడు రోజులు..

కేంద్రంలో వారానికి మూడు రోజులపాటు ఉచితంగా శిబిరం నిర్వహిస్తారు. ప్రతి బుధ, గురు, ఆదివారాల్లో రోగులకు సేవలందిస్తున్నారు. జనరల్ ఫిజిషియన్, గైనకాలజీ, పిడియాట్రిషన్, ఆర్థో, న్యూరో తదితర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో శిబిరంలో 60 మంది రోగులకు సేవలు అందుతున్నాయి. ఆయా విభాగాలకు చెందిన వైద్యుల్లో నిస్వార్థంగా సేవలందించాలనే వారికి సంస్థ అవకాశం కల్పిస్తోంది. పట్టణంలోని పలువురు ప్రైవేటు వైద్యులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. వారంలో ఒకరోజు తమ సమయాన్ని శిబిరానికి కేటాయిస్తున్నారు. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు అవసరమైనవారికి దేశంలోని సత్యసాయి ట్రస్టు అధునాతన ఆసుపత్రులకు పంపి భరోసా కల్పిస్తున్నారు.

ముగ్గురికి గుండె శస్త్రచికిత్సలు..జగిత్యాల వెల్‌నెస్ కేంద్రం నుంచి ముగ్గురు చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు చేయించారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెకు చెందిన వేదశ్రీ(16 నెలల) చిన్నారికి ఛత్తీస్‌గఢ్ రాయపూర్ ఆసుపత్రిలో, మంచిర్యాల జిల్లా లక్షెటిపేటకు చెందిన ఉషిక(8) చిన్నారికి బెంగళూరు ముద్దెనహళ్లి ఆసుపత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. జగిత్యాల పట్టణానికి చెందిన లలిత(10 సంవత్సరాల) చిన్నారికి రాయపూర్‌లో శస్త్రచికిత్స చేయించారు. వీరంతా నిరుపేద కార్మికుల పిల్లలు. ఒక్కో శస్త్రచికిత్సకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుంది. వెల్‌నెస్ సంస్థ సహకారంతో పూర్తి ఉచితంగా చిన్నారులకు సేవలందాయి.

వంద కేంద్రాలు లక్ష్యంగా...

సత్యసాయి సుజల స్రవంతి ట్రస్టు ఆధ్వర్యంలో ఈ తరహా వెల్‌నెస్ కేంద్రాలు దేశంలో 100 ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా తెలంగాణలోని కాగజ్‌నగర్, జగిత్యాలలో ఒక్కో కేంద్రం స్థాపించారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 20 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. సేవానిరతి కలిగిన వైద్యులు, సిబ్బందినే ఈ కేంద్రాలకు వినియోగిస్తున్నారు. జగిత్యాల కేంద్రంలో ఒక సమన్వయకర్తతోపాటు మరో ముగ్గురు సిబ్బంది పనిచేస్తారు. వీరందరికీ వేతనాలు ట్రస్టు ద్వారా చెల్లిస్తున్నారు. ట్రస్టు ద్వారా మందులు కొన్ని సరఫరా చేస్తుండగా స్థానికంగా అవసరమైన మందులను లాభాపేక్ష లేని ఏజెన్సీల నుంచి సమకూర్చుకుంటున్నారు.

రోగ నిర్ధారణే ముఖ్యం

చాలామంది రోగ నిర్ధారణ పరీక్షలు లేకుండానే అనేక వ్యాధులకు గురై మరణిస్తున్నారు. సకాలంలో రోగ నిర్ధారణ చేసి అవసరమైన వేరకు వైద్య సలహాలు, చికిత్స అందించాలనే సంకల్పంతో సత్యసాయి ట్రస్టు ఈ కేంద్రాలను నెలకొల్పుతోంది. ప్రైవేటు వైద్యం ఖరీదు కావడంతో అదే తరహా వైద్యాన్ని రోగులకు అందించాలనేది కేంద్రం ఉద్దేశం. నిరుపేదలు, మధ్యతరగతి అనే భేదం లేకుండా అందరికీ పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఊటూరి శ్రీకాంత్, వెల్‌నెస్ ప్రాంతీయ సమన్వయ కర్త

# కూలిపోతున్న బతుకులు

నల్గొండ : నల్గొండ జిల్లా పరిధిలో విద్యుదాఘాతంతో ప్రాణనష్టం జరుగుతోంది. నిర్దేశిత ప్రాంతాల్లో విద్యుత్తు ఉద్యోగులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు సక్రమంగా నిర్వహించడం లేదు. గ్రామాల్లో స్థిర నివాసం ఉండాల్సిన విద్యుత్తు ఉద్యోగులు పట్టణాల్లో గడిపేస్తున్నారు. ఈ క్రమంలో పల్లెల్లో వ్యవసాయ బోరుబావులు, పంట పొలాల వద్ద విద్యుత్తు లైన్ల నిర్వహణ సక్రమంగా లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తరచూ విద్యుత్తు నియంత్రికల వద్ద ఫ్యూజులు కాలిపోవడం, లూజ్‌లైన్లు, వేలాడుతున్న తీగలు సరి చేయకపోవడం వంటి కారణాలతో విద్యుత్తు సరఫరా నిలిచిపోతోంది. దీంతో రైతులు స్వయంగా మరమ్మతులు చేసే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలు జీవాలకు సైతం ప్రాణ సంకటంగా పరిణమిస్తున్నాయి. వరుస ప్రమాదాలు...ఒక పక్క విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం..మరో పక్క ప్రజలు పూర్తిగా అవగాహన లేకుండా తీగల మరమ్మతులు చేయడం మూలంగా కూలికి వెళ్లిన యువకులు, పొలాలకు వెళ్లిన రైతులను కరెంటు కాటేయడంతో కానరాని లోకాలకు వెళుతున్నారు. కొందరు క్షేత్రస్థాయిలో పనిచేయా ల్సిన విద్యుత్తు సిబ్బంది ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని మరమ్మతుల పనులు చేయించడంతో వారు కూడా కరెంటుకు బలవుతున్నారు.

జిల్లా పరిధిలో కొద్ది రోజులుగా వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్క రోజే రెండు చోట్ల విద్యుత్తు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కనగల్ మండలం బాబాసాహెబ్‌గూడెం గ్రామానికి చెందిన నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లబోతు సైదిరెడ్డి( 50) తన వ్యవసాయపొలంలో విద్యుత్తు స్తంభం నుంచి బోరుకు సరఫరా చేసే కరెంటు తీగలను సరిచేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు.

దేవరకొండ డివిజన్ పరిధిలోని చందంపేట మండల కేంద్రంలో తన వ్యవసాయపొలంలో మెట్ట పైర్లకు నీటి తడులు అందించి బోరు వద్ద ఉన్న స్టార్టర్లలో కరెంటు నిలిపివేసే తరుణంలో యువకుడు కోమండ్ల అనిల్(22) విద్యుదాఘాతానికి గురై విగత జీవిగా మారాడు.

జూన్ 30న నకిరేకల్ పురపాలిక సుందరయ్యనగర్‌లో వలస కార్మికుడు నిషాద్ చంద్రశేఖర్(34) అద్దె ఇంట్లో దుస్తులు ఉతికి ఇనుప తీగపై ఆరేసే సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు.

జూన్ 30న మునుగోడు మండలం తూర్కగూడెంలో రైతు దండు దుర్గయ్యకు చెందిన గేదె విద్యుత్తు స్తంభానికి తాకి ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం నల్గొండ పట్టణంలో విద్యుత్తుస్తంభాన్ని తాకిన ఆవు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది.

పరిహారంలో జాప్యం లేదు

విద్యుత్తు ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలకు పరిహారం త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. మృతుడికి సంబంధించిన పత్రాలు బాధిత కుటుంబాలు అందించడంలో జాప్యం జరుగుతోంది. వచ్చిన దరఖాస్తులను వెంటనే ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. విద్యుత్తు లైన్ల నిర్వహణపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాం. చంద్రమోహన్, ఎస్ఈ, నల్గొండ జిల్లా

# పల్లె నుంచి జడ్పీ దాకా ప్రత్యేకాధికారుల పాలన



కరీంనగర్: గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు.. ఇలా స్థానిక సంస్థల్లో కీలకమైన పరిపాలన పగ్గాలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. 4వ తేదీ జిల్లా, మండల పరిషత్తుల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో మండలాల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ ప్రారంభమవనుంది.. ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం పూర్తవడంతో మరుసటి రోజు నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారులుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు సహా ఇతర గెజిటెడ్ హోదా కలిగిన వారిని నియమించారు. తాజాగా ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల గడువు ముగియడంతో జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులకు మండల పరిషత్తు అధ్యక్షుడి స్థానంలో ప్రత్యేకాధికారి బాధ్యతలు అప్పగించారు.

నిధుల లేమితో ఆటంకమే..

ఒకప్పుడు జడ్పీలో నిధుల గలగలలు దండిగా ఉండేవి. 2017లో జిల్లాల విభజన జరగ్గా 2019 నుంచి కొత్త జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. అప్పటి వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంగానే వ్యవస్థ కొనసాగింది. 2014కు ముందు భారీగా నిధులు రాగా.. 2014-15 తరువాత నిధులు, విధుల పరంగా అవరోధాలు ఎదురవుతూ వచ్చాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 13వ ఆర్థిక సంఘం నిధులు రూ.27 కోట్లు, బీఆర్జీఎఫ్ ద్వారా రూ.23 కోట్లు ఇతర మార్గాల ద్వారా రూ.10 కోట్లు సమకూరాయి. రూ.60 కోట్లతో జడ్పీ ఖజానా ఉమ్మడి జిల్లాలో కళకళలాడింది. ఇక 2015-16 ఆర్థిక సంవత్సరంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అందించే బీఆర్జీఎఫ్ నిధులు, ఆర్థిక సంఘం నిధులు రద్దయ్యాయి. దీంతో ఒక్క ఏడాది వ్యవధిలోనే 80 శాతం నిధులకు కోత పడింది. ఇక అప్పటి నుంచి కేవలం జిల్లాల్లోని ఇసుక క్వారీలు, రిజిస్ట్రేషన్, అద్దెలు, సీనరేజీ, తలసరి ఆదాయం వంటి నిధులు రూ.10 కోట్ల వరకే అందాయి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లా పరిషత్తులు వేర్వేరుగా పరిపాలన పరంగా మంచి మార్పును చూపించినప్పటికీ నిధులు, విధుల పరంగా సభ్యులు చాలా అవస్థలు ఎదుర్కొన్నారు. నిరసనలు, ఆందోళనలతో సర్వసభ్య సమావేశాల్లో వారి గోడు వెలిబుచ్చుకున్నారు. గడిచిన అయిదేళ్లలో ప్రతి జిల్లాకు కనీసం రూ.15 నుంచి 20 కోట్లు అందని పరిస్థితి నెలకొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక విడత, 2024-25కి సంబంధించి రెండు విడతల నిధులు నాలుగు జిల్లాలకు రాలేదు. ఇక సీనరేజీ ద్వారా రావాల్సిన మొత్తాన్ని కూడా ప్రభుత్వమే తీసుకోవడంతో గ్రామాలకు 25 శాతం, మండలాలకు 50 శాతం, జడ్పీకి 25శాతం వాటా నిధులు రాకుండా పోయాయి.

పెండింగ్ పనులు : జడ్పీ ప్రత్యేక గ్రాంట్, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్, సాధారణ నిధులతో పలు గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, అంగన్వాడీల్లో మౌలిక వసతులు, బడుల్లో చిన్నపాటి నిర్మాణాలు, మురుగు కాల్వల నిర్మాణపు పనులు చాలాచోట్ల ఇంకా కొనసాగాల్సి ఉంది. వీటిపై మండలాల ప్రత్యేకాధికారితోపాటు ఎంపీడీవోలు సంయుక్తంగా దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన పూర్తిచేయించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 వరకు ఇలాంటి పనులున్నట్లు అంచనా.!

సమావేశాలు మమ : కరోనా విపత్తు సహా ఇతర సమయాల్లో అనుకున్న విధంగా సర్వసభ్య సమావేశాలు జరగలేదు. వాస్తవానికి ప్రతి మూడు నెలలకోమారు సమగ్రంగా చర్చ జరిగి గ్రామాల్లో ఉన్న సమస్యల్ని తీర్చే వాతావరణం ఉండాలి. ఈ లెక్కన అయి దేళ్లల్లో 20 జరగాలి. కానీ వాయిదాలు పడినవే ఎక్కువున్నాయి. 42 అంశాలపై సభ్యులు, అధికారుల మధ్య లోతైన చర్చ జరగాలి. కానీ ఎక్కడా ఏడెనిమిది అంశాలకు మించి చర్చను కొనసాగించలేదు.

'ప్రత్యేక' హాజరు తక్కువే : జడ్పీ సమావేశాలకు చట్టసభల్లోని ప్రజాప్రతినిధులు ఎంపీ, రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ప్రత్యేకాహ్వానితులుగా, సభ్యులుగా రావాల్సి ఉంటుంది. కానీ చాలా సందర్భాల్లో వీరు గైర్హాజరవడంతో ప్రాధాన్య అంశాలు చర్చకు రాలేదు.

వేతనాలకు ఎదురుచూపులు : గౌరవ వేతనాల కోసం సభ్యులు గడిచిన ఆరు నెలలుగా నిరీక్షిస్తున్నారు. నెలకు జడ్పీ ఛైర్‌పర్సన్‌కు రూ.లక్ష, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.13 వేలు, ఎంపీటీసీలకు రూ.6500 ఇవ్వాలి. ఇలా నాలుగు జిల్లాల్లో నెలకు రూ.57.75 లక్షల చొప్పున ఆర్నెల్లకు సంబంధించి రూ.3.46 కోట్లు చెల్లించాల్సి ఉంది.

సేవతో పదవికి న్యాయం చేశా

కరీంనగర్ జడ్పీ ఛైర్‌పర్సన్‌గా నా పదవి కాలంలో ప్రజలకు సేవ చేస్తూ వారికి న్యాయం చేశాననే భావన ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ చూపించా. ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో కరీంనగర్ జడ్పీకి ప్రత్యేక గుర్తింపు రావడం మరిచిపోలేని అనుభూతి. అందరి సహకారంతోనే ఇది సాధ్యమైంది. సమష్టి కృషితో ప్రాధాన్య క్రమంగా అన్ని రకాల నిధులను ఆయా పనులకు వినియోగించగలిగాం. ఇంకా ఎక్కువ నిధులు వస్తే బాగుండనే ఆశ ఇంకా అలాగే మిగిలిపోయింది. జడ్పీటీసీ సభ్యులు, అధికారులందరి సహకారం మరిచిపోలేను. – కనుమల్ల విజయ

# ధాన్యం దారి మళ్లుతోందా..?

కామారెడ్డి : 'నిజాంసాగర్ మండలంలోని ఓ రైస్‌మిల్లుకు 2021-22 సీజన్‌లో ధాన్యం కేటాయించారు. సదరు మిల్లరు ప్రభుత్వానికి బియ్యం ఇవ్వలేదు. దీంతో అధికారులు ఆయనను డీఫాల్టర్‌గా నిర్ణయించి తదుపరి సీజన్ల నుంచి ధాన్యం కేటాయించడం లేదు. ఆ మిల్లులో ఉన్న ధాన్యాన్ని సదరు మిల్లరు వారం రోజులుగా బిచ్కుంద మండలంలోని మరో మిల్లుకు తరలిస్తున్నాడు. ధాన్యం తరలింపు కోసం అధికారులకు దరఖాస్తు పెట్టుకున్నాడు. అనుమతి రాక ముందే ధాన్యాన్ని లారీల్లో ఇతర మిల్లుకు పంపిస్తున్నాడు. ఇప్పటికే కొన్ని లారీల ధాన్యం తరలిపోయింది.'

సీఎంఆర్ ఇవ్వడంతో మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. ఎఫ్‌సీఐ అనేకమార్లు గడువు పొడిగించినా స్పందన రావడం లేదు. పనిలో పనిగా కొందరు డీఫాల్లర్లు మిల్లుల్లో ధాన్యాన్ని మాయం చేస్తున్నారు. ఇతర మిల్లులకు తరలిస్తున్నారు. అధికారుల నుంచి అనుమతి రాకుండానే వారికి నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం కనిపించలేదనే కారణంతో ఇప్పటికే రెండు



మిల్లులపై కేసులు నమోదయ్యాయి.

ఇతరులకు విక్రయం

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లర్లు మర పట్టించి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి, పౌరసరఫరాలశాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. మిల్లర్లు వివిధ కారణాలు చూపుతూ సకాలంలో ఇవ్వడం లేదు. కొందరు మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని ఇతరులకు విక్రయించుకుంటున్నారు. మిల్లుల్లో మర పట్టించి ఇతరులకు టోకు మొత్తంగా విక్రయిస్తున్నారని వినిపిస్తోంది. ధాన్యాన్ని లాభాలకు విక్రయించుకుంటున్నారు. రేషన్ దుకాణాల ద్వారా సేకరించిన బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి సీఎంఆర్ కింద చూపుతున్నారని తెలుస్తోంది.

అధికారులదే బాధ్యత

మిల్లులకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖది. ముఖ్యంగా డీఫాల్టర్ మిల్లర్లు ప్రభుత్వ అనుమతి లేకుండా ఒక మిల్లు నుంచి ఇతర మిల్లులకు ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తరలించరాదు. కానీ జిల్లాలో కొందరు మిల్లర్లు ధాన్యాన్ని ఇష్టానుసారంగా తరలించినప్పటికీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గత సీజన్‌లలో, ప్రస్తుతం మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని రక్షించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

అనుమతి లేకపోతే తరలించరాదు: నిత్యానంద్, ఇన్‌ఛార్జి డీఎం, పౌరసరఫరాల శాఖ, కామారెడ్డి అనుమతి లేకుండా ఒక మిల్లు నుంచి ఇతర మిల్లులకు ధాన్యం తరలించరాదు. ఒకవేళ తరలించాల్సి వస్తే మిల్లరు దరఖాస్తు చేసుకోవాలి. అనుమతి వచ్చిన తర్వాతే ధాన్యాన్ని తరలించాలి. నిజాంసాగర్ మండలంలో ధాన్యం తరలిస్తున్నారని తెలిసి క్షేత్రస్థాయికి అధికారులను పంపించాం. ఏం జరిగిందో తెలుసుకుని చర్యలు తీసుకుంటాం.

# శంకుస్థాపనతో సరి.. నిర్మాణం ఎప్పుడో మరి!

తాండూరు: తాండూరు పట్టణంలో ఆటోనగర్ నిర్మాణానికి 2023 అక్టోబరులో అప్పటి ప్రభుత్వం రూ.12.6 కోట్లు మంజూరు చేసింది. అంతారం గుట్ట సమీపంలో స్థలాన్ని కేటాయించి, పనులకు శంకుస్థాపన చేసినా ఒక్క అడుగు ముందుకు పడలేదు. తాండూరుకు ఖనిజాల ఖిల్లాగా పేరుంది. తాండూరు, బషీరాబాద్ మండలాల్లో నాపరాళ్లు, సున్నపు రాయి గనులున్నాయి. సున్నపు రాయి ఆధారంగా సిమెంటును ఉత్పత్తి చేసే మూడు ప్రధాన కర్మాగారాలు, ముడి నాపరాయిని నునుపుగా మార్చే 800 యూనిట్లు ఉన్నాయి. పెద్దేముల్ మండలంలో సుద్దగనులున్నాయి. ముడి సుద్దతో ఉత్పత్తి జరిగే గ్రాన్యువల్స్‌ను తయారు చేసే పరిశ్రమలున్నాయి. నాపరాయి, సిమెంటు, ముడి సుద్దను దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేసే భారీ వాహనాలు వేలల్లో తాండూరు మీదుగానే రాకపోకలు సాగిస్తాయి. వీటిని పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా నిలుపుతున్నారు. ఆటోనగర్ నిర్మాణం పూర్తయితే పట్టణ వాసులకు ఎంతో వెసులు బాటు కలుగుతుంది. లారీల పార్కింగ్‌కు వసతులు కల్పిస్తారు. వాహనాల మరమ్మతుకు సంబంధించి మెకానిక్‌లకు షెడ్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది.

# బల్దియా జాగాపై ప్రైవేటు జబర్దస్తీ!

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఆస్తులతో ప్రైవేటు వ్యక్తులు రూ.కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమ ప్రకటనల బోర్డుల ఏర్పాటుతో రూ.లక్షల్లో అద్దె వసూలు చేసుకుంటున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు ఏజెన్సీ రాత్రికి రాత్రి హిమాయత్‌నగర్ రోడ్డు పొడవునా వంద బోర్డులను ఏర్పాటుచేయడమే అందుకు నిదర్శనం. అధికారులు వాటిని తొలగించకూడదన్న ఉద్దేశంతో.. మేయర్ విజయలక్ష్మి ఫొటోలతో వాటిపై ప్రకటనలు వేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు.

ఇవిగో ఉదాహరణలు..

నారాయణగూడ ఫ్లైఓవర్ నుంచి మినర్వా హోటల్ వరకు ఆదివారం రాత్రి 100 లాలిపప్ ప్రకటనల బోర్డులు వెలిశాయి. వాటిపై అధికారులను వివరణ కోరితే.. అక్రమంగా ఏర్పాటుచేసిన విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు.



బిమాక్స్ రోడ్డు, జూబ్లీహిల్స్ రోడ్డులో ప్రకటనల బోర్డులు వందల్లో ఉన్నాయి. వాటికి సంబంధించిన కోర్టు కేసులో అధికారులు సరైన వాదనలు వినిపించడం లేదన్న ఆరోపణలున్నాయి.

నిషేధం అందుకేనా.. : హోర్డింగులు, విభాగినులు, రోడ్లకు ఇరువైపు లా ప్రమాదాలకు తావిచ్చే ఆయా ప్రకటనలను జీహెచ్ఎంసీ నిషేధించింది. దీంతో నగరవ్యాప్తంగా 1,500కుపైగా హోర్డింగులు ఖాళీ అయ్యాయి. అవినీతి అధికారుల అండదండలతో అనధికార హోర్డింగులు, బోర్డులు, ఇతర రకాల ప్రకటనలు పుట్టుకొస్తున్నాయి.

# బొద్దుగా.. వద్దు..!

మిర్యాలగూడ : ఇటీవల కాలంలో ధనిక, పేద అని తేడా లేకుండా ప్రతి ఒక్కరి ఆహార అలవాట్లలో మార్పులు వచ్చాయి. ప్రధానంగా మార్కెట్లో బేకరీ, జంక్‌ఫుడ్ అమ్మకాలు అధికంగా ఉ న్నాయి. ఈ జంక్‌ఫుడ్ తినే వారిలో అత్యధిక మంది చిన్నారులే ఉ ండటం గమనార్హం. దీంతో అనేక మంది చిన్నారులు ఊబకాయం బారిన పడుతున్నారు. ఊబకాయం సమస్యను చిన్నతనంలోనే అధిగమించకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదం సైతం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో నాలుగు లక్షల మంది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో ఆరేళ్ల లోపు వారు 1,52,860 మంది ఉండగా..ఉ న్నత పాఠశాల విద్యార్థులు 1,68,291 మంది ఉన్నారు. 2023-24 గణాంకాల ప్రకారం ఒక్క నల్లగొండ జిల్లాలోనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,240 ఉండగా..వీటిలో ఐదో తరగతి లోపు 37,208 మంది విద్యార్థులు ఉన్నారు. 349 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా.. 56,976 మంది ఐదో తరగతి లోపు విద్యార్థులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న చిన్నారులు, కౌమార దశలో పిల్లల్లో సుమారు 14 శాతం మంది ఊబకాయం సమస్యతో బాధపడుతున్నట్లు అంచనా. 2030 నాటికి ప్రతి పది మంది చిన్నారుల్లో ఒకరు ఊబకాయ సమస్య బారిన పడనున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

నివారించేందుకు మార్గాలు ఇవీ..

పోషకాలు కలిగిన ఆరోగ్యకర ఆహార అలవాట్లు ప్రోత్సహించడం.


శారీరక శ్రమ కోసం క్రీడలు, ఆటలు ఆడేందుకు అవకాశాలు కల్పించడం.

టీవీ, ఫోన్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ తెరలను దూరంగా ఉంచడం.

తరచూ ఎత్తు, బరువులు చూడడం..వైద్యుడిని సంప్రదించడం.

ఆహారపు అలవాట్లే కారణం..

పిల్లలు ఊబకాయం సమస్య బారిన పడటానికి ప్రధానంగా ఆహారపు



అలవాట్లే కారణం. టీవీ, ఫోన్ చూస్తూ భోజనం చేయడం, తీపి పానీయాలు అధికంగా తాగడం, ఉదయం అల్పాహారం తినకపోవడం, బయట ఆహారం అధికంగా తీసుకోవడం, బర్గర్లు, పిజ్జాలు వంటి మైదాపిండితో చేసే జంక్‌ఫుడ్ అధికంగా తినడం, అధిక కేలరీలు ఉ ండే ఆహారాన్ని అధికంగా తీసుకుని ఎలాంటి శారీరక శ్రమ చేయకపోవడం వల్ల చిన్నారులు ఊబకాయం బారిన పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఆహారపు అలవాట్లకు చిన్నతనం నుంచే బీజం పడుతుందని.. ఇప్పటి నుంచే పిల్లల్లో మంచి ఆహారపు అలవాట్లు నేర్పించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి

ఇటీవల కాలంలో పిల్లల్లో అధిక బరువు, స్థూలకాయం సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పిల్లలు నిత్యం జంక్‌ఫుడ్, పిండి పదార్థాలు, తీపి పదార్థాలు అధికంగా తీసుకోవడమే. చిన్నప్పటి నుంచే పిల్లల్లో మంచి ఆహార అలవాట్లు నేర్పించడంతో పాటు అన్ని రకాల ఆటలు కూరగాయలు తినేలా ప్రోత్సహించాలి. పిల్లలకు ప్రతి నెల క్రమం తప్పకుండా బరువు చూస్తూ..మార్పులు ఏమైనా ఉ ంటే తక్షణమే వైద్యులను సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలి.

డాక్టర్ నితిన్ రాయ్, ఆర్బీఎస్కే వైద్యాధికారి, మిర్యాలగూడ

# కరుణించని వరుణుడు.. కదలని కాడి!



తాండూరు: వానాకాలం సాగుకు పదకొండు రోజులే గడువు ఉంది. జులై 15 వరకు పెసర, మినుములు మినహా అన్ని రకాల పంటలకు సంబంధించిన విత్తనాలు వేసుకునే అవకాశం ఉంది. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు ముందుకు సాగడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 5,75,946 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే 5,97,830 ఎకరాలకు చేరుతుందని అధికారులు లెక్కలు వేశారు. జూన్ ఆరంభంలో నైరుతి రుతుపవనాల రాక సందర్భంగా వర్షాలు విస్తారంగా కురిశాయి. దీంతో పొలాలు సిద్ధం చేసుకున్న వారు విత్తనాలు వేశారు. కొందరు చదును చేశారు. ఈ లోపే వరుణుడు మబ్బుచాటునే ఉండిపోయాడు. జులై రెండో తేదీ వరకు అన్ని రకాల పంటలు కలిపి 2,29,958 ఎకరాల్లోనే సాగు చేయడంతో 39.93 శాతం నమోదైంది. ఇంకా 3,45,988 ఎకరాలు సాగుకు నోచలేదు.

పెసర, మినుము నామమాత్రమే: జిల్లాలో పెసర, మినుముల సాగు నామమాత్రంగానే ఉంది. మినుముల సాధారణ సాగు 8,518 ఎకరాలకు 4,012, పెసర 17,258 ఎకరాలకు 7,161 ఎకరాల్లో సాగైంది. వీటి సాగుకు గడువు లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు.

ఆగస్టు వరకు వరి : వరి పంట సాగుకు ఆగస్టు చివరి వరకు అవకాశం ఉంది. ప్రస్తుతం దీర్ఘకాలిక రకాలకు సంబంధించిన వరి నాట్లు వేశారు. స్వల్పకాలిక రకాలకు నారు మడులను వేశారు. వర్షాలు కురిస్తే కరిగెట్లుగా మార్చి, నాట్లు వేయనున్నారు. 99,549 ఎకరాల్లో వరి సాగు చేయాలని లక్ష్యాన్ని నిర్ణయించారు. ఇప్పటి వరకు కేవలం 141 ఎకరాల్లోనే సాగైంది. ఇంకా సమయం ఉండడంతో విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ భావిస్తోంది.

పంటల సాగు ఇలా: కందులు 1,51,389 ఎకరాలకు 64,507, పత్తి 2,31,338 ఎకరాలకు 1,43,606, మొక్కజొన్న 52,507 ఎకరాలకు 7,727, జొన్న 5,869 ఎకరాలకు 266, సోయాబిన్ 2,250 ఎకరాలకు 1,811 ఎకరాల్లో సాగైంది. మిగిలిన పంటల సాగు నామమాత్రంగానే ఉంది.

కంది, పత్తికి జులై చివరి వరకు అవకాశం

వర్షాలు అనుకూలిస్తే జులై 15 వరకు పెసర, మినుములు మినహా అన్ని రకాల పంటలు సాగు చేసుకోవచ్చు. వర్షాభావ పరిస్థితులు తలెత్తితే కంది, పత్తి వంటి పంటలను జులై చివరి వరకు సాగు చేయవచ్చు. రైతులు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు సవ్యంగా చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చు.

గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి.

# ముగిసిన సర్వే.. ముమ్మరంగా పనులు!




కొడంగల్: రాష్ట్రంలో కొడంగల్‌ను నమూనా నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముందుగా విద్య, వైద్యం, రవాణా రంగాలపై అధికారులు దృష్టి సారించారు. ఎస్టీ గురుకులం ఉన్న చోటనే, మైనార్టీ, ఎస్సీ, బీసీ గురుకులాలను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించారు. మైనార్టీ గురుకులానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్ల మరమ్మతుకు, నిర్మాణానికి రూ.176 కోట్లు మంజూరు కావడంతో టెండర్లు పూర్తి చేశారు. కొన్నిచోట్ల భూమి పూజ చేశారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో మెడికల్ హబ్‌కు శ్రీకారం చుడుతున్నారు. జిల్లా స్థాయి ఆసుపత్రిలో ఉండే అన్ని వసతులు కల్పించేందుకు కార్యాచరణ చేపట్టారు. కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం 50 పడకలుండగా, 220కి పెంచనున్నారు. ఇందుకోసం రూ.27 కోట్లు కేటాయించారు.

ఒకే చోట వైద్య కళాశాలలు: మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ కళాశాలల నిర్మాణానికి కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో 74 ఎకరాల అసైన్డ్ భూమిని పరిశీలించారు. ఇందులో 45 మంది రైతుల నుంచి 60 ఎకరాలను తీసుకోనున్నారు. వారితో అధికారులు చర్చలు జరిపారు. ఉద్యోగంతోపాటు, ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరం భూమికి రూ.10 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే కళాశాలల పక్కనే వెంచర్ ఏర్పాటు చేసి ఒక ప్లాటు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నారు. ఈ అంశాలను రైతులకు వివరించి ఒప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

స్థలాన్ని సేకరించేందుకు చర్యలు

మెడికల్ కళాశాలల స్థల సేకరణ, ఇతర పనులు వేగంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అప్పాయిపల్లిలోని 60 ఎకరాలను పరిశీలించాం. రైతులతో చర్చలు జరుపుతున్నాం.

వెంకట్రెడ్డి, 'కడా' ప్రత్యేక అధికారి.

# వృక్ష రాజసం... హరిత శోభితం



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని రెండు వైపులా ఉన్న బైపాస్ రోడ్లు పచ్చని చెట్లు, పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రహదారులకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలతోపాటు వివిధ రకాల పూల మొక్కలు నాటి పెంచారు. దీంతో ఇవి ఏపుగా పెరిగి హరిత శోభితం సంతరించుకుంది. ఆయా మార్గాల్లో వెళ్లేవారికి కనువిందు చేస్తున్నాయి.

వేములవాడ పట్టణం చుట్టూ దాదాపు రూ.150 కోట్లతో మొదటి, రెండో బైపాస్ రహదారులను నిర్మించారు. వాటికి ఇరువైపులా, డివైడర్ల మధ్య నీడనిచ్చే, వివిధ రకాల పూల మొక్కలను అయిదారేళ్ల కిందట అటవీశాఖ పెద్ద ఎత్తున నాటి పెంచింది. ఆ తరవాత వాటి సంరక్షణ బాధ్యతలను మున్సిపల్ అధికారులకు అప్పగించింది. ప్రస్తుతం ఆ మొక్కలన్నీ పెరిగి పెద్దవై పచ్చదనాన్ని పంచుతున్నాయి. రోడ్లకు రెండు వైపులా, డివైడర్లలో పెరిగినవి, ఇతర పూల చెట్లు హరిత శోభితంతో కనువిందు చేస్తుండగా, ప్రజలకు మంచి వాతావరణాన్ని, స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయి. ఉదయం నడకకు వెళ్లేవారికి, ఆయా మార్గాల్లోని రహదారులపై వెళ్లే వాహనదారులకు పచ్చదనం, విరబూసిన పూలు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. డివైడర్ల మధ్య ఉన్న పూల మొక్కలు, ఇతర మొక్కలు ఎండాకాలంలో ఎండిపోకుండా వీటి సంరక్షణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు నీటినందించే విధంగా రూ.8 లక్షలతో డ్రిప్ ఏర్పాటు చేశారు. దీంతో రహదారుల వెంబడి డివైడర్లలోని మొక్కలు పచ్చగా కళకళలాడుతున్నాయి.

నిర్మాణ ప్రాంతాల్లో కనుమరుగు

పట్టణంలో మూలవాగు వంతెన నుంచి ఇరువైపులా ఉన్న రెండు బైపాస్ రహదారులు గతంలో అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా ఉ ండేవి. అలాంటి రహదారులు అభివృద్ధి చెంది పట్టణానికి కళను తీసుకువచ్చాయి. వీటి వెంబడి ఇరువైపులా పెరిగిన వివిధ రకాల చెట్లు ఈ రహదారులకు కొత్తందాలను తెచ్చి పెడుతుండగా, కొందరు వ్యక్తులు ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికివేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఒకటో, రెండో బైపాస్ రహదారుల వెంబడి పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటిని నిర్మిస్తున్న సందర్భంలో ఇంటి యజమానులు నిబంధనలకు విరుద్ధంగా గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రి చెట్లను తొలగిస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణ ప్రజలు వాకింగ్ చేయడానికి ఎంతోగానో దోహదపడుతున్న ఆయా మార్గాల్లో చెట్లు నరికివేస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని పచ్చదనాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు విరివిగా మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం. బైపాస్ రహదారుల వెంబడి ఇళ్ల నిర్మాణం చేస్తున్నవారు చెట్లను తొలగిస్తే గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి.

– అన్వేష్, కమిషనర్, మున్సిపల్, వేములవాడ

# కందులు అ'ధర'హో

చొప్పదండి: చొప్పదండి జువ్వాడి చొక్కారావు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ ఏడాది కందులకు మంచి ధర పలుకుతోంది. పంట సీజన్ ముగిసినా ధర మాత్రం తగ్గడంలేదు. రోజురోజుకు పెరుగుతోంది. పంట చేతికి వచ్చిన సమయంలో క్వింటాకు రూ.9 వేల వరకు ఉండగా, పెరుగుతూ వస్తోంది. ఈ సీజన్‌లో మార్కెట్‌లో అత్యధికంగా రూ.11,350 ధర పలికింది.

చొప్పదండి మార్కెట్‌కు ఈ సీజన్‌లో సుమారు 700 క్వింటాళ్లకు పైగా కంద్నలు విక్రయానికి వచ్చాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని ధర్మారం, వెల్గటూర్, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, జూలపల్లి, గంగాధర, రామడుగు తదితర మండలాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చి కందులు అమ్ముకుంటున్నారు. దుకాణాల్లో కంది పప్పు ధర రూ.200 వరకు ఉండటంతో స్థానికులు సైతం కందులు కొనుగోలు చేసి పప్పుగా మార్చుకుంటున్నారు. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో పంట సాగు కాకపోవడంతోపాటు తక్కువగా దిగుబడి రావడంతో కందులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. వ్యాపారులు



పోటీపడి మరి కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా మార్కెట్‌లో ధర రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటి వరకు దాచి అమ్ముతున్న వారికి మంచి లాభం వస్తోంది.

రైతుల సంతోషం

కందులకు ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.5800 కాగా, ఇటీవల దానిని రూ.6300కు పెంచింది. అయినా మార్కెట్‌లో మాత్రం ప్రభుత్వ మద్దతు ధర కంటే రెట్టింపు డబ్బులు ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట సీజన్ ప్రారంభంలో మొదటగా అమ్ముకున్న వారికి క్వింటాల్‌కు రూ.9 వేలు రాగా ప్రస్తుతం రూ.11 వేలకు చేరుకుంది. నిల్వ చేసి అమ్మడం ద్వారా పెట్టుబడులు పోను లాభాలు పొందుతున్నామని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

గరిష్ఠ ధర పొందండి

గతేడాది కంటే ఈ ఏడాది కందులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది. రైతులు నాణ్యమైన కందులను తీసుకొచ్చి గరిష్ఠ మద్దతు ధర పొందాలి.– మల్లేశం, మార్కెట్ కార్యదర్శి

# ఎత్తిపోసేలా.. ఎదురుచూపులు..!

నల్గొండ : సాగర్ ఎడమకాల్వ పరిధిలో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాల నిర్వహణ రైతులకు భారంగా మారడంతో.. ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రభుత్వమే చేపడుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వమూ ఇదే విధంగా హామీ ఇచ్చినా..అది నెరవేరకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాకే చెందిన మంత్రి ఉత్తమ్ సాగునీటి శాఖ మంత్రిగా ఉండటంతో త్వరలోనే ఇది నెరవేరనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఎడమకాల్వ పరిధిలో 42 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి కింద 80 వేల ఎకరాల ఆయకట్టును గతంలో స్థిరీకరించారు. పదేళ్ల క్రితం ఈ ఎత్తిపోతల పథకాలను ప్రపంచబ్యాంకు నిధులు, రూ.40 కోట్ల వ్యయంతో ఆధునికీకరించారు. గతంలో ఈ పథకాల నిర్వహణ, పర్యవేక్షణ అంతా నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ (ఐడీసీ), అనంతరం నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) అధికారులే చూసేవారు. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఎత్తిపోతల నిర్వహణను క్రమంగా రైతులకు అప్పగించారు. మరమ్మతులు చేసినా.. ప్రభుత్వ పరంగా సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో వానాకాలం, యాసంగి సీజన్లలో కాల్వకు నీళ్లు వదిలినప్పుడు వాటిని చివరి ఆయకట్టు వరకూ చేరవేయలేక రైతుల పొలాలు ఎండిపోతున్నాయి. సగానికి పైగా పథకాలు మూతపడే దశకు చేరుకున్నాయి.మొత్తం 42లో ఏ ఎత్తిపోతల పథకమూ దాని పరిధిలో స్థిరీకరించిన ఆయకట్టుకు నీళ్లందించం లేదు. ఉదాహరణకు ఈ కాల్వపై అతిపెద్ద ఎత్తిపోతలను నడిగూడెం మండలం సిరిపురం వద్ద నిర్మించగా..దీని పరిధిలో ఏడు గ్రామాలకు సంబంధించి 6200 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం 8 మోటార్లతో దీనిని డిజైన్ చేయగా...ప్రస్తుతం రెండు దశల్లో కలిపి 4 మోటార్లే పనిచేస్తున్నాయి. రెండు మోటార్లు కాలిపోయి రెండేళ్లయినా ఇప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్తు నియంత్రిక సమస్యతో పాటూ పంప్‌హౌస్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, కీలకమైన నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం చేపడితేనే ఎత్తిపోతల పథకాలు గాడిన పడనున్నాయి.

సాంకేతిక సహాయకుల నియామకం రెండు, మూడు ఎత్తిపోతలకు కలిపి ఒక సాంకేతిక సహాయకుడిని నియమిస్తామని మంత్రి ప్రకటించడంతో క్షేత్రస్థాయిలో మాత్రం ఒక ఎత్తిపోతలకు ఇద్దరు సహాయకులు తప్పనిసరిగా ఉంటేనే మోటార్ల నిర్వహణతో పాటూ నిర్ధరించిన ఆయకట్టుకు నీరందుతుందని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు చూస్తున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) పరిధిలోనూ తగినంత మంది సిబ్బంది లేరు. ఒక ఏఈ స్థాయి అధికారి ఆరు నుంచి 8 లిఫ్టులను పర్యవేక్షిస్తుండగా...పని భారంతో చాలా వరకు క్షేత్రస్థాయిలో అవి అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడం లేదు. ఈ పథకాల నిర్వహణలోనూ సాంకేతిక పరిజ్ఞానం రైతులకు కొరవడటంతో తరుచూ మోటార్లు కాలిపోవడం, వాటి మరమ్మతులు, ఇతరత్రా వాటిని రైతులు ఎకరానికి ఇంత అని వసూలు చేయడం జరుగుతోంది. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, కాల్వలకు లష్కర్లను నియమిస్తారనే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు.




# సముద్రాన్ని తలపిస్తున్న ముంబై మహానగరం..

ముంబయి మహానగరం సముద్రంగా మారింది. భారీ వర్షాలతో ఎక్కడ చూసినా వాణిజ్య నగరంలోని రహదారులపై వరద నీరు కనిపిస్తోంది. వర్షం నీటిలో వాహనాలు మునిగిపోతున్నాయి. ముంబై మీదుగా నడిచే పలు రైళ్లను దారి మళ్లించారు. రుతుపవనాలు విస్తరించడంతో మహారాష్ట్ర రాజధాని ముంబైలో గత కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడ చూసినా రోడ్లపై వరద నీరు కనిపిస్తోంది. రోడ్ల నుండి రైలు పట్టాల వరకు అన్ని చోట్లా నీరు నిల్వ ఉంది. దీంతో వాహనాలు గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. పలు రైళ్లను రైల్వేశాఖ దారిమళ్లించింది. రైలు పట్టాలపై భారీగా నీరు, మట్టి చేరడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మరోవైపు విమానాశ్రయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరో రెండు రోజులపాటు ముంబై మహానగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. మహారాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని ఐఎండి తెలిపింది.

**కూలిన చెట్లు..** భారీ వర్షాల కారణంగా ముంబై మహానగరంలోని పలు రైల్వేస్టేషన్లలో పట్టాలపై చెట్టు పడిపోవడంతో కసర, టిట్వాలా స్టేషన్ల మధ్య లోకల్ రైలు సర్వీసులను నిలిపివేశారు. అట్గావ్, థాన్సిట్ స్టేషన్ల మధ్య ట్రాక్‌లపై నీరు, మట్టి పేరుకుపోయింది. ఈ మార్గంలో రైల్వే ట్రాక్‌లపై చెట్టు పడిపోయాయి. దీంతో వశింద్ రైల్వే స్టేషన్‌ను అధికారులు బ్లాక్ చేశారు. ఈ స్టేషన్ మీదుగా వెళ్లే రైళ్లను దారి మళ్లించారు.

**అధ్వాన్నంగా రోడ్లు..** రైల్వేస్టేషన్‌తో పాటు రోడ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. కొన్ని అడుగుల ఎత్తు వరకు నీరు నిండిపోయింది.

రోజూ వాహనాలు నడిచే రోడ్లపై నీరు నిలవడంతో వాహనాలు మునిగిపోతున్నాయి. ఎక్కువసేపు ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, ముంబైలోని అన్ని బీఎంసీ(బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్), ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలకు సెలవు ప్రకటించారు.

**రెయిన్ అలెర్ట్ :** రానున్న మూడు నాలుగు రోజుల పాటు ముంబై వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. జూలై 8 నుంచి 10వ తేదీ వరకు మధ్య మహారాష్ట్ర, మరత్వాడాలో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని, ముంబై, దాని పరిసర ప్రాంతాల్లోనూ మోస్తరు వర్షాలు కురవచ్చని తెలిపింది. పూణే, నాసిక్, సతారా, కొల్హాపూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఛత్రపతి సంభాజీనగర్, జాల్నా, లాతూర్, ధరాశివ్, నాందేడ్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. ముంబైతో పాటు థానే, పాల్ఘర్, రాయ్‌గఢ్, రత్నగిరి జిల్లాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు.




# తెలంగాణపై టీడీపీ ఫోకస్.. టార్గెట్ జీహెచ్ఎంసీ..!

తెలంగాణలో రాజకీయ సమీకరణలు రోజురోజుకు మారుతున్నాయి. ఓవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లోకి క్యూకడుతున్నారు. దీంతో ఆ పార్టీ బలహీనపడుతూ వస్తోంది. కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఆచితూచి అడుగులేస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసేందుకు హస్తం పార్టీ తన ప్రణాళికలు రూపొందిస్తుంది. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకోవాలనే ఆలోచన చేస్తోంది. దీనిలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అదే సమయంలో తెలంగాణలో పూర్వవైభవం సాధిస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తిరేపుతున్నాయి. చంద్రబాబు నాయుడు ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన గడ్డపై తెలుగుదేశం పార్టీ మళ్లీ బలపడుతుందంటూ కార్యకర్తలనుద్దేశించి వ్యాఖ్యానించారు.

**తెలంగాణలో బలపడేందుకు..** తెలంగాణ గడ్డపై తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. విభజన తర్వాత నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో తెలంగాణలో ఆ పార్టీ ప్రభావం కొంతమేర తగ్గింది. పార్టీలో నాయకులు ఇతర పార్టీలో చేరిపోయారు. కొంతమంది మాత్రం పార్టీని నమ్ముకుని ఉన్నారు. గత తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీచేయలేదు. అయితే ఎన్నికల తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ పార్టీ ప్రస్తుతం బలహీనంగా కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ విస్తృతంగా ప్రచారం చేసినా ఆ పార్టీ ఒక్కసీటు గెలుచుకోలేదు. కనీసం సొంత జిల్లా మెదక్‌లోనూ ప్రభావం చూపలేకపోయింది. దీంతో బీఆర్ఎస్ బలహీనపడుతుందనే వార్తల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఆ స్పేస్‌ను ఆక్రమించుకునే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

**టార్గెట్ జీహెచ్ఎంసీ..** మరో ఏడాదిన్నరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పునర్వైభవం సాధించే వీలుటుందని తెలుగుదేశం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టీడీపీ ఎన్డీయే మిత్రపక్షంగా ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలో బీజేపీ బలంగా ఉంది. దీంతో వచ్చే ఎన్నికల్లోనూ ఏపీ కాంబినేషన్‌ను రిపీట్ చేయాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీచేస్తే మేయర్ పీఠం దక్కించుకోవచ్చనే ప్లాన్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది.




ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను కష్టాలు వీడటంలేదు. అరెస్టై నాలుగు నెలలు గడుస్తున్నా కవితకు ఈకేసులో బెయిల్ లభించలేదు. దీంతో బెయిల్ కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత.. ప్రస్తుతం డిఫాల్ట్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవితకు న్యాయస్థానం జ్యుడిషియల్ కస్టడీని పొడిగిస్తూ వస్తోంది. మరోవైపు బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తోంది. తాత్కాలిక బెయిల్ కోసం కవిత తరపు న్యాయవాదులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాజాగా డిఫాల్ట్ బెయిల్ కోసం కవిత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. నిర్ణీత వ్యవధిలోగా సీబీఐ దర్యాప్తు పూర్తిచేయలేకపోడంతో తమ క్లయింట్‌కు బయిల్ ఇవ్వాలని కవిత తరపు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ వేశారు. వెంటనే డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు.

**కొత్త వ్యూహం..** ఏదైనా ఒక కేసు దర్యాప్తు పూర్తిచేయడానికి చట్టంలో పలు నిబంధనలు ఉన్నాయి. నిర్దేశించిన సమయంలో దర్యాప్తు పూర్తిచేయకపోతే జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న నిందితులకు బెయిల్ పొందే హక్కు ఉంటుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-%జ=ూజ% నిందితులకు ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. సీఆర్పీసీ 167(2) ప్రకారం ఏదైనా ఒక కేసుకు సంబంధించి దర్యాప్తు సంస్థలు నిర్దిష్ట గడువులోగా విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ పోలీసులు సకాలంలో చార్జిషీట్ దాఖలు చేయకపోతే కోర్టు నుంచి అనుమతి తీసుకోవల్సి ఉంటుంది. అలాచేయని పక్షంలో నిందితులకు బెయిల్ పొందే అవకాశం ఉంటుంది. దీనిని డిఫాల్ట్ బెయిల్ అంటారు. ప్రతికేసు విషయంలో డిఫాల్ట్ బెయిల్ నింబధనలు ఒకే విధంగా ఉండవు. నేరాలు, కేసుల తీవ్రత ఆధారంగా గడువు ఉంటుంది. సాధారణంగా నిందితులను అరెస్ట్ చేసిన తర్వాత 24 గంటల్లో విచారణ పూర్తిచేయడం సాధ్యం కాదని భావిస్తే దర్యాప్తు సంస్థలు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టి కస్టడీ కోరాల్సి ఉంటుంది. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాత ఆ వ్యక్తి జ్యూడిషియల్ కస్టడీకి వెళ్లిపోతాడు. అప్పటి నుంచి నిందితుడిని విచారించాలంటే న్యాయస్థానం అనుమతి తీసుకోవల్సి ఉంటుంది.

**గడువు దాటితే..** ఏదైనా కేసులో నిందితుడికి కోర్టు విధించిన కస్టడీ గడువు ముగిసినా విచారణ పూర్తికాపోతే.. దర్యాప్తు సంస్థలు కోర్టును మరింత గడువు కోరతాయి. దీంతో న్యాయస్థానం కస్టడీని పొడిగిస్తూ ఉంటాయి. మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష లేదా కనీసం పదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్న కేసుల్లో కస్టడీ గడువు గరిష్ఠంగా 90 రోజులు ఉంటుంది. మిగతా కేసుల విషయంలో గరిష్ఠంగా దర్యాప్తు సమయం 60 రోజులు ఉంటుంది. ఈ గడువు పూర్తయినా కూడా కేసు విచారణ పూర్తికాకపోతే నిందితులు బెయిల్ పొందే చట్టబద్ధమైన హక్కునే డిఫాల్ట్ బెయిల్ అంటారు. కవిత కేసుకు సంబంధించి ఈ గడువు పూర్తవడంతో ఆమె తరఫున లాయర్లు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి.

# వైఎస్సారే నాకు స్ఫూర్తి.. ఎంతో నేర్చుకున్నా..



అమరావతి/ఢిల్లీ, జూలై 8: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అసలైన ప్రజా నాయకుడు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా రాహుల్ నివాళులర్పించారు. వైఎస్సార్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత గుర్తుచేసుకున్నారు. ఎల్లప్పుడూ ప్రజల కోసమే బ్రతికిన నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన మరణం అత్యంత విషాదమన్నారు. రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉంటే ఏపీ ముఖచిత్రం వేరేలా ఉండేదని చెప్పుకొచ్చారు. వైఎస్సార్ బ్రతికి ఉంటే ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌కు ఈ పరిస్థితి ఉండేది కాదని.. కష్టాలు,కన్నీళ్లు ఉండేవి కావని రాహుల్ తెలిపారు.

**ఆ లక్షణాలు షర్మిలలో చూశా....** తండ్రి వారసత్వాన్ని కూతురు షర్మిల సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారని.. ఆ నమ్మకం తనకు బలంగా ఉందని స్పష్టం చేశారు. షర్మిల న్యాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌లో ఉన్న ధైర్యం, సిద్ధాంతాలు, న్యాయకత్వ లక్షణాలు షర్మిలలో చూశానన్నారు. తాను వ్యక్తిగతంగా వైఎస్సార్ నుంచి ఎంతో నేర్చుకున్నానని.. ఆయన పాదయాత్ర తన జోడో యాత్రకు స్ఫూర్తి అని చెప్పుకొచ్చారు. నాడు రాజశేఖర్‌రెడ్డి ఎండను, వర్షాన్ని లెక్క చేయకుండా పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. ఆయనే తనకు స్ఫూర్తి అన్నారు. నేడు 75వ జయంతి సందర్భంగా వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పిస్తున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# ఆరు గ్యారంటీలకు వైఎస్ స్ఫూర్తి: సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు గాంధీ భవన్‌లో ఘనంగా జరిగాయి. వైఎస్ చిత్రపటానికి టీ కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర ఇన్చార్జ్ దీపాదాస్ మున్షి, కేవీపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో సంక్షేమాన్ని గుర్తు చేసేది వైఎస్సార్ పాలన అని, వైఎస్ ముద్ర పేదల గుండెల్లో బలంగా ఉందని, ఆరు గ్యారంటీలకు వైఎస్ఆర్ స్ఫూర్తి అని అన్నారు. దేశానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తన లక్ష్యమని వైఎస్ అనేవారని, కాలం కాటువేసిందో, దురదృష్టం వెంటాడిందో గానీ రాహుల్ ప్రధాని కాకముందే వైఎస్ చనిపోయారని రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ పాదయాత్రకు స్ఫూర్తి వైఎస్ చేసిన పాదయాత్ర అని, రాహుల్ పాదయాత్ర కూడా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమని అన్నారు. రాహుల్ ప్రధాన ప్రతిపక్ష నేతగా రాణిస్తున్నారని, ప్రధాని పదవికి రాహుల్ ఒక్క అడుగు దూరంలోనే అన్నారని, రాహుల్ ప్రధాని కావడం నేటి చారిత్రక అవసరమన్నారు. కష్టపడి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని, ఆయనను ప్రధాని చేయడానికి కృషి చేసేవారే వైఎస్ వారసులని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వానికి వ్యతిరేకంగా వెళ్ళేవారు వైఎస్ వారసులు కాదన్నారు. మూడేళ్లు పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని, రాజశేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఈరోజు 35 మందికి కార్పొరేషన్ పదవులు ఇచ్చామన్నారు. ఒక్కరు కూడా పైరవీకారులు లేరని, ప్రతి ఒక్క కార్యకర్తను కాపాడుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# కాలుష్యం పెరిగితే.. భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించవు: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో వన మహోత్సవం కార్యక్రమం జరిగింది. జీహెచ్ఎంసీలోని 56 ప్రాంతాల్లో 7,134 మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. వనమహోత్సవంలో భాగంగా జీహెచ్ఎంసీలోనే 30 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణను ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రామాంతపూర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "పిట్టలు గూళ్లు పెట్టలేని మొక్కలు నాటి గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని వృథా చేసింది. కాలుష్యం పెరిగితే భవిష్యత్ తరం మనల్ని క్షమించదు. మొక్కలు నాటడం ప్రభుత్వ బాధ్యతే అని కాకుండా.. ప్రజలు కూడా ముందుకు రావాలి" అని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. 30 సర్కిళ్లలో ఇవాళ 7000 పైగా మొక్కలు నాటనున్నట్లు మేయర్ విజయలక్ష్మి వెల్లడించారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం పదేళ్లలో అటవీ విస్తీర్ణం 147 శాతం పెరిగింది. 33.15 చదరపు కిలోమీటర్ల నుంచి 81.81 చదరపు కిలోమీటర్లకు పచ్చదనం పెరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి.

# డీఎస్సీని వాయిదా వేయాలని ఆందోళన.. విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



హైదరాబాద్: నగరంలోని విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. డీఎస్సీని వాయిదా వేయాలని లక్డీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి అభ్యర్థులు, విద్యార్థి సంఘాల నాయకులు యత్నించారు. ఇటీవల టీజీపీఎస్సీ నిర్ణయించిన హాస్టల్ వెల్ఫేర్, డీఏవో పరీక్షలను రాసినట్లు తెలిపారు. వరుసగా పోటీ పరీక్షలు ఉండటంతో చదవడానికి సమయం లేదని చెప్పారు. టెట్‌కు, డీఎస్సీకి భిన్నమైన సిలబస్ ఉండటంతో పూర్తి చేయలేకపోతున్నట్లు పేర్కొన్నారు. టెట్ ఫలితాలు తాజాగా విడుదలైన కారణంగా కొంత కాలం డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల నియామకాలు పూర్తయ్యే వరకు విద్యా వాలంటీర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యాలయ ముట్టడికి యత్నించిన అభ్యర్థులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660